

# దరఖాస్తులు

ఎస్.ఆర్.చందూర్

త్రిభువనదాస్ భాగ్యవంతుడు. భాగ్యవంతు డంటే యిలాగా అలాగాకాదు; అతి భాగ్యవంతుడు. అతనికి ఎంత ఆస్తి వుందో అతనికే తెలియదు. ఆ ఆస్తి వెండి రూపాయలుగా మారిస్తే, ఆ వెండి రూపాయలు కన్యాకుమారినుంచి విధ్య పర్వతాల దాకా పేర్చవచ్చునని ఒక వుద్దండుడు అంచనా కట్టాడు. అతను తలుచుకొంటే అణన్నరకిదొరికే షేవింగ్ బ్లేడ్ అర్థరూపాయిక్కూడా దొరక్కుండా చెయ్యగలడని కొందరు అర్థశాస్త్రకోవిదులు అంటారు. అందులోని నిజానిజాలు మన కంతగా తెలియవు. త్రిభువనదాస్ సన్మార్గుడనీ, దానధర్మాలు విరివిగా చేస్తాడనీ మరికొంత మంది అంటూ వుంటారు. ఆ విషయమూ మనం అంతగా నమ్మకూడదు. త్రిభువనదాస్ గుప్పెట్లో 13 పెద్ద కంపెనీలు వున్నాయి అతను ఎవరికీ ఒక పట్టాన కనిపించడు. పన్నెండేండ్లబట్టీ పనిచేస్తూ అతని మొహం ఎలా వుంటుందో చూడని బ్రాంచి మేనేజర్లు చాలా మంది వున్నారట.

13 కంపెనీల తాలూకు ఏ ఆఫీసులో ఎక్కడ ఏ ఉద్యోగం ఖాళీవచ్చినా, ఆ ఉద్యోగంకోసం వచ్చిన దరఖాస్తుదారులందర్నీ పరీక్షించి, వారిలో బాగా పనికొచ్చే వాడిని ఏరుకునేందుకు ఒక డిపార్టుమెంటు వుంది. దాని పేరు ఉద్యోగాల శాఖ. ఆ శాఖ నిర్వహణలో బోలెడంత కర్మకాండ వుంది. ఏదో ఒకఆఫీసులో గుమాస్తాగిరీ ఖాళీ అవుతుం

దనుకోండి. ఫలానా త్రిభువనదాస్ కంపెనీలో, ఫలానా బ్రాంచిలో, ఫలానా రకం ఉద్యోగం ఖాళీగా వుందనీ, ఫలానా అర్హతలు వున్నవారు, ఫలానా తేదీ అయిదు గంటల లోపున సదరు ఆఫీసుకి అందేటట్టు దరఖాస్తులు పెట్టుకో వచ్చుననీ దిన పత్రికలలో ప్రకటిస్తారు. లక్షలాది నిరుద్యోగులున్న ఈ దేశంలో దరఖాస్తు దారులకి కొరవ ఏమిటి ?

దరఖాస్తులు చూసే డిపార్టుమెంటులో నలుగురు గుమాస్తాలూ, ఒక హెడ్డూ వున్నారు. ఆ హెడ్డూ మా దాశరథి. గుమాస్తాల్ని సెలక్ట్ చెయ్యడం దాశరథి పని. దరఖాస్తూ, దరఖాస్తుకి గుచ్చి కంపెనీవారి ఫారం మొకటీ ఉంటాయి. ఆ ఫారమ్‌మీద దాశరథి తన రిమార్కులు రాయాలి. రూపం—తెలివి—ప్రపంచ జ్ఞానం — మిగతా విశేషాలు; ఈ నాలుగూ పూరించి, తను ఏ కారణం వల్ల ఫలానా దరఖాస్తుదారుని ఏరినదీ వివరిస్తూ చిన్న నోట్ రాసి, త్రిభువన దాస్‌గారి సెక్రటరీకి పంపాలి దాశరథి. అదంతా క్రమపద్ధతిలో జరగవలసిన తంతు. దాశరథి చేసిన సెలెక్షన్ పైవా ళ్ళెప్పుడూ కాదనరు.

*   *   *

"నీది భలే ఉద్యోగం !" అన్నాను.

"ఏం— అలా అంటావ్ ?" అని అడిగాడు దాశరథి

"నీ పని ఉద్యోగా లివ్వడమేగా !"

"అది మాత్రం మాటలా ? ఒక్క రోజు వచ్చి కూచో నా ఆఫీసులో—నీకే తెలుస్తుంది !" అని బెదిరించాడు.

ఉద్యోగం తీసెయ్యడమంటే కష్టం—ఒకళ్ల కడుపు కొట్టడమవుతుంది కనక ! ఉద్యోగం యివ్వడమంటే ఏదో పెళ్ళి భోజనం పెట్టడం లాంటిది. దాశరథి ఉద్యోగమే నాకు వుంటే ఎంత సంతోషిద్దును !

"నువ్వు చాలా అదృష్టవంతుడివి, దాశరథీ "

"రేపు మా ఆఫీసుకి రా."

*   *   *

మర్నాడు దాశరథి ఆఫీసుకి వెళ్లాను. అతని టేబుల్‌మీద 109 అప్లికేషనులు కంపెనీవారి ఫారాలతో సహా ఒక గుట్టగా పడివున్నాయి.

ఆఫీసులో 7 వ సెక్షనులో 5 వ గుమాస్తాని సెలెక్టు చెయ్యాలి మా దాశరథి. దరఖాస్తుదారు లందరూ యిరవై యిరవై మూడేళ్ళ మధ్య నున్నవారు.

"ఇవన్నీ నెంబరువారీగా వున్నాయి. దరఖాస్తుదారిది ఎన్నో నంబరో బయట నోటీసు బోర్డులో వుంటుంది," అన్నాడు దాశరథి నాకు తన ఉద్యోగ ధర్మాన్ని పరిచయం చేస్తూ.

కాలింగ్ బెల్ కాక, ఎలెక్ట్రిక్ బెల్ నొక్కగానే బయటనుంచి మొదటి దరఖాస్తుదారు లోపలికి ప్రవేశించాడు.

'టై' లేదుగాని కాటన్ సూటు వేసుకున్నాడు.

"పేరు...మాధవరావు కదూ ?"

"అవునండి."

"బ్రిటన్‌కి ప్రధాన మంత్రి ఎవరు ?"

"చర్చిల్."

"ఆల్ రైట్, ఇటుపక్క హాలులోకి వెళ్ళి కూచోండి, మిగతావారిని కూడా పరీక్షించిన మీదట మీకు ఉద్యోగం వచ్చేదీ రానిదీ చెబుతాను."

మాధవరావు పక్క హాలులోకి వెళ్ళి కూచున్నాడు. దాశరథి అతని తాలూకు ఫారమ్‌మీద యిలా రాశాడు: "ఉన్న దున్నట్టు మొహంమీద చెబుతాడు "

రెండవ దరఖాస్తుదారు ప్రవేశించాడు. గీరల పెంటూ, బుష్ కోటూ, కళ్ళజోడు కూడాను.

"పేరు ?" అని అడిగాడు దాశరథి.

"గోకుల్."

"బ్రిటన్‌కి ప్రధానమంత్రి ఎవరు ?"

"మాల్టోవ్."

"ఆల్ రైట్. ఇటుపక్క హాలులోకి వెళ్ళి కూచోండి. మిగతావారిని కూడా పరీక్షించిన మీదట, మీకు ఉద్యోగం వొచ్చేదీ రానిదీ చెబుతాను."

గోకుల్ పక్క హాలులోకి వెళ్ళి కూచున్నాడు. దాశరథి గోకుల్‌కి సంబంధించిన ఫారమ్‌మీద యిలా రాశాడు: "ఊహ పోహలు గల మనిషి."

"బ్రిటిష్ ప్రధాని మాల్టోవ్ అనే వాడికి వూహ పోహ లేమిటి - నీ తల కాయ నా తలకాయ" అన్నాను దాశరథితో.

"దీన్నే 'యింటెలిజెన్స్ టెస్ట్' అంటాము. ఆ కుర్రవాడికి తెలిసే, మనల్ని తమాషా చేసేందుకు చెప్పాడేమో !"

"ఏడ్చినట్టే వుంది - కానియ్ "

మూడవ దరఖాస్తుదారు వచ్చాడు. బిళ్ళగోచీ, పంచెకట్టు, లాల్చీ.

"పేరు ?"

"వినోదబాబు."

"బ్రిటన్‌కి ప్రధానమంత్రి ఎవరు ?"

"బ్రిటన్‌కి ప్రధాని ఎవరో తరవాత చూచుకుందాంగాని, ఆ ఉద్యోగం నాకిప్పించారా, నేను ఇండియాకి ప్రధాని నవుతాను."

ఆభరణంలా ధరించే చిరునవ్వు చెదరకుండా దాశరథి, "ఆల్ రైట్, ఇటు పక్క హాలులోకి వెళ్ళి కూచోండి. మిగతా వారినికూడా పరీక్షించిన మీదట, మీకు ఉద్యోగం వొచ్చేదీ రానిదీ చెబుతాను."

మూడవ దరఖాస్తుదారు పక్క హాలులోకి వెళ్ళాడు. నాకు వొళ్ళు మండిపోతోంది. ఈ దరఖాస్తుదారు లందరూ ఒక పిచ్చి సజ్జులా వున్నారు. వినోదబాబు ఫారమ్ మీద యిలా రాశాడు

మావాడు. "అనవసరమైనవాటి జోలికి పోడు."

నే నొక సిగరెట్టు ముట్టించి దాశరథికి ఆఫర్ చేశాను. "నువ్వు కాల్చుకో, నేను కాల్చకూడ దిక్కడ. నేను సిగరెట్టు ముట్టిస్తే, మా డిపార్ట్‌మెంట్ బాయ్స్ బీడీలు ముట్టిస్తారు," అన్నాడు దాశరథి

ఇంతలో నాలుగవ దరఖాస్తుదారు వచ్చాడు. ఖద్దరు చొక్కా ఖద్దరు పంచె-టోపీ మాత్రం లేదు

"పేరు ?"

"చిదంబరం.''

' బ్రిటన్‌కి ప్రధానమంత్రి ఎవరు ?"

చిదంబరం - "యింత చిన్న విషయం నాకు తెలియదనుకున్నారా !" అన్నట్టు మొహంపెట్టి - "ఆఁ... యివ్వాళ పేపరు చూడటం మర్చిపోయాను,'' అన్నాడు.

"ఆల్‌రైట్ ఇటు పక్క హాలులోకి..."

నాలుగవ దరఖాస్తుదారు పక్క హాలులోకి వెళ్ళాడు. నా కింక కోపతాపాలు పోయాయి. విరోధులకూడా దాశరథి ఉద్యోగం లాంటిది వొద్దనుకున్నాను. చిదంబరం ఫారమ్ మీద యిలా రాశాడు : 'ఎంత కావాలో అంతే తెలుసుకుంటాడు '

అయిదవ దరఖాస్తుదారు బ్రిటన్‌కి ప్రెసిడెంటే గాని ప్రధాని లేదన్నాడు. ఆరవ అతను — బ్రిటిష్ ప్రధాని ఛాంబర్లేనో, ట్రూమనో అయుండాలి, ఎవరయితే మనకేం - అన్నాడు. ఏడవ అతను తడుముకోకుండా 'రూచ్ వెల్ట్' అన్నాడు. 12 వ అతను 'జార్జి' అన్నాడు 34 వ అతను 'ముస్సోలినీ' 'స్టాలిన్' పేరు చెప్పిచూదా మనుకున్నాడు'— 69 వ అతను.

లంచ్ టైములో దాశరథితో అన్నాను : ప్రతి చవట వెధవనీ ఇలా చిరునవ్వుతో ఆహ్వానించి, వాడు చెప్పే వెర్రి సమాధానం శ్రద్ధగా విని, మళ్ళీ వాణ్ణి చిరునవ్వుతో సాగనంపడానికి చాలా ఓర్పు కావాలి. నీ కెంత యిచ్చినా మీ వాళ్ళకి నష్టం లేదు నాకైతే వాళ్ళ జవాబులు వినలేక పిచ్చెత్తుతోంది సుమా ! వెనక ఒక టీచరు మిత్రుడు చెప్పాడులే 'మద్రాస్‌నుంచి ఏమి ఎగుమతి అవుతుంది' - అని తను ప్రశ్నయిస్తే - 'కచ్చికలు' అని రాశాడట, ఒక అఖండుడు ఆ కుర్రవాడికి 'కచ్చికలు' మినహా మరొకటి స్ఫురించకపోవడం వింతగా లేదూ ?"

"నో, నో, ఆ కుర్రవాడు పెద్దయిన తర్వాత పళ్ళ వ్యాధితో బాధపడతాడు."

"ఇలాటి మిడతంబొట్లు శకునాలు చెబుతేనే, ఆ త్రిభువనదాస్ నీ కీ ఉద్యోగం ఇచ్చినట్టున్నాడు "

"ఏమైనా, సాయంత్రందాకా వుండి యజ్ఞం పూర్తి చేయించి వెళ్ళు."

లంచ్ అయాక మళ్ళీ మొదలెట్టాడు దాశరథి

"పేరు ?"

ఫలానా... వెంకయ్యో, తిమ్మప్పో, మాసిలామణో, రామన్ నాయరో... ఏదో ఒకటి.

"బ్రిటన్‌కి ప్రధానమంత్రి ఎవరు ?"

84 వ అతను 1947 ఆగస్టు 15 వ తేదీనుంచీ తనా పక్కకి చూడటం మానేశానన్నాడు. 93 వ అతను 'స్మట్స్' అన్నాడు మహా తెలివిగా. 108 వ అతను మన కెందుకు పోనిద్దురు అన్నాడు కలుపుగోరుతనంగా.

పరీక్ష సర్వ సంపూర్ణం అయేప్పటికి నాలుగైంది. 109 మంది దరఖాస్తు దారులకీ మధ్యాన్నం కాఫీ టిఫినూ త్రిభువన్‌దాస్ కంపెనీవారి కాంటీన్ ఫ్రీగా సప్లయి చేసింది అందరూ ఫలితం కోసం ఎదురుచూస్తూ పక్క హాలులో కూచున్నారు. దాశరథి ఎవరిని సెలెక్టు చేస్తాడా అని నేనూ ఎదురుచూస్తున్నాను.

చటుక్కున ఫోన్ తీసి, అవు నవును ... సెక్రటరీగారు కావాలి ... దాశరథి మాట్లాడుతూవుంట...ఎంప్లాయి మెంట్ డిపార్ట్‌మెంట్ దాశరథి. E ఆఫీసుతో 7 వ సెక్షన్‌లో 5 వ గుమాస్తాగా గోకుల్‌ని సెలెక్టు చేశాను," అన్నాడు.

"ఓకె, ఓకె," అని వినిపించింది ఫోనులోనుంచి

గోకుల్ లోపలికి పిలవబడ్డాడు. మిగతా 108 మంది ఏడుపు మొహాలతో యిళ్ళకి వెళ్ళిపోయారు. దాశరథి గోకుల్‌కి ఒక పచ్చ కార్డు యిచ్చాడు; మర్నాడు పొద్దున్న 9-55 కి E ఆఫీసు దగ్గర హాజరై 7 వ సెక్షన్ పెద్దుని కలుసుకో మన్నాడు గోకుల్ ఎంతో సంతోషంగా వెళ్ళిపోయాడు.

"నీ సెలక్షన్ నా కేమీ నచ్చలేదు బ్రదర్. బ్రిటిష్ ప్రధాని పేరేమిటో తెలియని వాడికి ఉద్యోగ మివ్వడ మేమిటి ?"

"పోన్లెద్దూ, నా డ్యూటీ నేను చేశాను" అన్నాడు దాశరథి.

*　　*　　*

మూడు రోజులు పోయాక, సాయంత్రంవేళ క్లబ్బులో కనిపించి చెప్పాడు దాశరథి: "నన్ను మా కంపెనీవాళ్లు అమెరికా పంపిస్తున్నారు, స్టడీ టూర్"

"ఏడ్చినట్టేవుంది. బ్రిటిష్ ప్రధాని మాక్మోవ్ అన్న బడుద్ధాయికి ఉద్యోగం యిచ్చిన ఘనుడివి కనకనా ?"

"అక్కడే వుంది కీలకం."

"ఏమిటి ?"

"గుమాస్తాలను సెలెక్టు చేయడంలో నా అంతటివాడు ఇండియాలో లేడని త్రిభువనదాస్ అన్నాడట. నా సెలెక్షన్ చాలా బావుంది కనక అమెరికా పంపిస్తున్నారు."

"ఎందుకని బావుంది ?"

"గోకుల్ అనే బావమరదొకడు మా సెక్రటరీకి వున్నాడని నేను ముందు తెలుసుకుని వుండటంవల్ల."